క్లుప్తంగా

ఎదురెదురుగా వాహనాల ఢీ


ధ్వంసమైన వాహనం

మార్టూరు: జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న ఘటన గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో మార్టూరు సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. రాంచి నుంచి బెంగళూరు వెళ్తున్న ఐషర్ వాహనాన్ని రాజుపాలెం కూడలి సమీపంలో అదే మార్గంలో ఎదురుగా రాంగ్ రూట్లో వస్తున్న మరో వాహనం ఢీకొట్టింది. ప్రమాద ధాటికి రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసం కాగా రెండు వాహనాల డ్రైవర్లు మహబూబ్ బాషా, ఇస్మాయిల్‌లకు తేలికపాటి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని వాహనాలను రహదారి నుంచి పక్కకు జరిపి ట్రాఫిక్ అవరోధాలను తొలగించారు. మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీరాజ్ ఏఈకి మంత్రి, కలెక్టర్ నివాళులు

మేదరమెట్ల: పంచాయతీ రాజ్‌లో ఏఈగా పని చేస్తున్న ఉద్యోగి మరణించడంతో ఆయన మృతదేహానికి మంత్రి, కలెక్టర్ నివాళులర్పించారు. బాపట్ల జిల్లా పంచాయతీరాజ్‌లో కొరిశపాడు మండలం పమిడిపాడుకు చెందిన హరే రామకృష్ణ (61) ఏఈగా పనిచేస్తున్నాడు. ఆయన గురువారం గుండెపోటుతో మరణించగా మృతదేహాన్ని పమిడిపాడుకు తరలించగా విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకట మురళీ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పెదగంజాం మార్గంలో తగ్గని వాగుల ఉధృతి



వాగులో నీరు చేరి ఉండటంతో ముళ్లకంచె, ట్రాక్టర్ అడ్డుపెట్టిన స్థానికులు

చినగంజాం: మండలంలోని పెదగంజాం గ్రామానికి వెళ్లేందుకు మార్గం సుగమం కాలేదు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. గురువారం వర్ష ప్రభావం లేకపోయినప్పటికీ ఇంతకు ముందు కురిసిన వర్షపు నీరు పూర్తిగా ప్రవహించే మార్గం లేక నిలబడిపోయింది. ఉప్పుగుండూరు పెదగంజాం, రొంపేరు వంతెన గుండా వెళ్లే మార్గంలోను వాగు ప్రవహిస్తుండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నిండుగా ఉన్న వాగును దాటేందుకు ప్రయత్నాలు చేయకుండా ఉండేందుకు స్థానికులు ముళ్లకంచెలు వాహనాలను అడ్డుగా ఉంచారు.

ఇదీ కారంచేడు రోడ్ల దుస్థితి..


కారంచేడు బ్రహ్మంగారి గుడి వద్ద నీట మునిగిన రహదారి

కారంచేడు: సంపన్నుల గ్రామంగా పిలువబడే మండల కేంద్రం కారంచేడు గ్రామంలోని పలు రహదారులు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. బ్రహ్మంగారి గుడి బజారు, పలు కాలనీకి వెళ్లాలన్నా ప్రజలు నానా అవస్థలు పడాల్సిందేనని వాపోతున్నారు. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే రహదారుల్లోనే పరిస్థితులు ఇలా ఉంటే చిన్న చిన్న కాలనీల్లోని రహదారుల పరిస్థితి ఎంటో అని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


కారంచేడులో కాలనీకి వెళ్లే రహదారిలో నిలబడిన మురుగు

రైతుల కష్టం.. దళారుల భోజ్యం

- కూరగాయల మార్కెట్‌లో కమీషన్ వ్యాపారుల గుత్తాధిపత్యం
- మొత్తం షాపులు 90 కాగా 14 మంది చేతిలో 34 షాపులు
- షాపులు, వాహనదారుల నుంచి రోజువారి వసూళ్లు
- చోద్యం చూస్తున్న అధికారులు, కూటమి ప్రభుత్వం


మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న దళారులు

మార్టూరు: పట్టెడన్నం పెట్టే రైతనంటే చాలా మందికి చిన్నచూపు. కష్టపడి రైతు పండించిన పంటను అమ్ముకోవాలంటే అదొక యుద్ధలాంటిది. పొలంలో విత్తేటప్పటి నుంచి మార్కెట్‌లో పంటను అమ్ముకునేంత వరకూ రైతన్నను నిలువు దోపిడీ చేస్తూనే ఉన్నారు. అటు రైతన్నలు.. ఇటు వినియోగదారులు దారుణంగా మోసపోతుంటే మధ్యలో ఉన్న దళారులు మాత్రం లాభాలు గడిస్తూ మోసం చేస్తున్నారు. రాష్ట్రంలోని అతిపెద్ద కూరగాయల మార్కెట్లలో మార్టూరు కూరగాయల మార్కెట్ ఒకటి. ఈ ప్రాంతంలో సుమారు 15 మండలాల్లో పండే మిర్చి, దొండ, బెండ, పొట్ల, వంగ, చిక్కుళ్లు, ఆకుకూరలు, దోస తదితర కూరగాయలు ఇక్కడి నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు తరలి వెళ్తుంటాయి. అధికారిక లెక్కల ప్రకారమే ఈమార్కెట్ రోజువారి టర్నోవర్ ప్రస్తుతం రూ.5 లక్షలు కాగా శనివారం రోజుల్లో మార్కెట్ సెలవు మినహా నెలకు రూ.1.50 కోట్ల చొప్పున సంవత్సరానికి రూ.18 కోట్ల టర్నోవర్ ఉంటుంది. ఈటర్నోవర్ మీద ఒక శాతం యూజర్ చార్జి వసూలు చేయడం ద్వారా వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఏడాదికి రూ. 18 లక్షల ఆదాయం చేకూరుతుంది. ఇక అనధికారిక టర్నోవరైతే సంవత్సరానికి రూ. 20 కోట్లు అనేది విశ్వసనీయ సమాచారం. ఈ మార్కెట్ పరిధిలో లైసెన్స్ కలిగిన కమిషన్ వ్యాపారులు సుమారు 225 మంది ఉండగా 240 మంది వరకు హమాలీలు ఉన్నారు.

ఒక్కొక్కరికి మూడేసి షాపులు..

వ్యాపారం నిమిత్తం మార్కెట్లో 90 షాపులు ఉండగా వాటిపై నెలకు రూ.1.50 లక్షల చొప్పున సంవత్సరానికి రూ.18 లక్షల ఆదాయం ప్రభుత్వానికి చేకూరుతున్నట్లు అధికారిక సమాచారం. 225 మంది లైసెన్స్ వ్యాపారులన్న మార్కెట్‌లో 90 షాపులు ఉండగా అవి కేవలం 30 మంది గుత్తాధిపత్యంలో ఉంటున్నాయి. ఒక వ్యాపారి చేతిలో ఐదు షాపులు ఉండగా మూడేసి షాపులు చొప్పున ముగ్గురి చేతిలో, రెండేసి షాపులు చొప్పున దాదాపు పది మంది అధీనంలో ఉండగా వారు నామమాత్రపు అద్దె మార్కెట్‌కు చెల్లిస్తూ షాపులు సబ్ లీజుకు ఇవ్వడం లేదా తమ బినామీలతో వారే వ్యాపారం చేయడం సర్వసాధారణమైంది. లైసెన్స్ కలిగిన వ్యాపారులు 200 మందికి పైగా ఉండగా ఉన్నా షాపుల్లో ఎక్కువ శాతం సిండికేట్ స్వాధీనంలో ఉండటంతో షాపులు లేని వ్యాపారులు మార్కెట్ మధ్యలోని ప్లాట్‌ఫారం మీదకూర్చొని వ్యాపారం చేసుకోవాల్సి వస్తోంది. యూజర్ చార్జీ, షాపుల అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో లింకు రోడ్ల నిర్మాణాలు రైతులకు అవసరమైన సౌకర్యాలు పూర్తి చేయాల్సి ఉండగా ఆ దాఖలాలు ఏమీ లేకపోవడం గమనార్హం.


మార్టూరు కూరగాయల మార్కెట్ ముఖద్వారం

కమీషన్, తరుగు పేర్లతో నిలువు దోపిడీ..

రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చే కూరగాయల బస్తాల నుంచి తరుగు లేదా తారం పేరుతో చేసే దోపిడీ చాలా ఉంటుంది. ఉదాహరణకు పచ్చిమిర్చి బస్తాలలో 29 కిలోల్లోపు బస్తాకు రెండు కిలోలు, 59 కిలోల్లోపు బస్తాకు మూడు కిలోలు, 64 కిలోలు ఆపై బరువన్న బస్తాకు నాలుగు కిలోల చొప్పున తూకంలో తరుగు తీసివేస్తారు. ఇలా అన్ని రకాల కూరగాయల బస్తాలకు ఇదేవిధంగా తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారు దళారులు.

ఎనిమిది శాతం కమీషన్‌తో మోసం..

రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లో వ్యాపారస్తులకు విక్రయించుకున్నందుకుగాను నాలుగు శాతం కమిషన్ వ్యాపారులకు ఇవ్వాలనే నిబంధన ఉంది. దీనిని సాకుగా తీసుకొని వ్యాపారులు పేమెంట్ ఇవ్వడానికి వారం రోజులు ఆగాల్సి వస్తుంది. సరుకు అమ్మిన రోజే డబ్బు కావాలంటే 8% కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని, అదేవిధంగా తమ నుంచి వసూలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. సహజంగా రైతులకు కూలీలకు బట్వాడా, మందుల కొనుగోలు, తమ గృహ అవసరాల దృష్ట్యా 10% కమీషన్‌కు అయినా సరే ఇష్టపడి తక్షణం నగదు కావాలనుకోవడం ఈ వ్యాపారులకు లాభసాటిగా మారింది. మార్కెట్ కమిటీ లోని నలుగురైదుగురు వ్యాపారులు సిండికేట్‌గా మారి గుత్తాధిపత్యం సాగించటం గమనార్హం. రైతుల స్వేదాన్ని, రక్తాన్ని తాగుతూ పరాన్న జీవులుగా మారి అక్రమాలు సాగిస్తున్న ఈ కమిషన్ వ్యాపారుల నుంచి రైతులకు విముక్తి కలిగించాలని ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

యూనియన్ పేరిట వసూళ్ల దందా..

ప్రభుత్వ వ్యవహారాలతో సంబంధం లేకుండా మార్కెట్ వ్యాపారులు యూనియన్‌గా ఏర్పడి చేస్తున్న వసూళ్లకు లెక్కా పత్రం ఉండదని మార్కెట్లోని వ్యాపారులే ఆరోపించడం గమనార్హం. మార్కెట్‌లోని ప్రతి షాపు నుంచి రోజుకు రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఈ మార్కెట్‌కు కూరగాయలు తరలించే వాహనాల నుంచి వాహనానికి ఇంతా అని కాంట్రాక్టు పద్ధతిన ఓ వ్యక్తి వసూలు చేస్తాడు. అలాగే ఈ మార్కెట్ నుంచి బయటకు వెళ్లే వాహనాన్ని బట్టి చేసే వసూళ్లు చేస్తుంటాడు. సగటున రోజుకు రూ.2500 నుంచి నెలకు రూ.75 వేల చొప్పున ఏడాదికి రూ.9 లక్షలు వసూలు చేయడం గమనార్హం. ఈ వసూళ్లకుగాను మార్కెట్ యూనియన్ నాయకులు చెప్పేదేమంటే కమీషన్ వ్యాపారుల్లో ఎవరైనా మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి ఈ మొత్తం నుంచి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేస్తారు. వినాయక చవితి పండగ, నాయకులు, అధికారులు ఎప్పుడైనా మార్కెట్‌కు వచ్చినప్పుడు ఈమొత్తంలో నుంచే ఖర్చుచేస్తారు. అంతేకానీ రైతుల శ్రేయస్సు కోసం కానీ మార్కెట్ అభివృద్ధి కోసం కానీ నామమాత్రపు చర్యలు తీసుకోరని స్థానిక వ్యాపారులే విమర్శించడం విశేషం.


వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న తాత్కాలిక ఉద్యోగి

> **కొద్దిమంది చేతుల్లో షాపులు ఉన్న విషయాన్ని పరిశీలిస్తున్నాం..**
> మార్కెట్‌లో షాపులు కొంతమంది చేతుల్లో ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. దాన్ని పరిశీలిస్తున్నాం. యూజర్ చార్జీ షాపుల అద్దె మాత్రమే అధికారికంగా వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందుతుంది. యూనియన్ తరపున షాపుల నుంచి వాహనదారుల నుంచి రోజువారి వసూలు చేస్తున్న విషయం మాకు తెలుసు. కానీ అది మాకు సంబంధించిన విషయం కాదు.
> – రామకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, పర్చూరు

> **ఎమ్మెల్యే జోక్యం చేసుకొని రైతులకు అండగా నిలవాలి..**
> కూరగాయల మార్కెట్లో కమీషన్ వ్యాపారుల దౌర్జన్యం చాలా తీవ్రంగా ఉంది. తారం పేరుతో కమీషన్ల పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దీనిపై దృష్టి పెట్టి రైతులకు అండగా నిలవాలి.
> – వై. రాంబాబు, మండల రైతు సంఘం నాయకుడు



> **హైదరాబాద్‌కు వెళ్లి అమ్ముకుంటున్నాం..**
> మార్టూరు కూరగాయల మార్కెట్లో కూరగాయలు అమ్మితే 8% కమీషన్ తీసుకొని కూడా వారం రోజులకు పేమెంట్ ఇస్తున్నారు. ఈ దోపిడీ భరించలేక దాదాపు ఇక్కడికి రావడం మానుకున్నాం. ఎక్కువ దిగుబడులు రాగానే నేరుగా హైదరాబాద్ తీసుకెళ్లి అమ్ముకుంటున్నాం.
> – కమతం పుల్లయ్య, రైతు, రామాంజనేయపురం



ఆదికవి వాల్మీకి జీవితం ఆదర్శనీయం


చీరాలలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అతిథులు


సంతమాగులూరులో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్


చీరాలలో మాట్లాడుతున్న కృష్ణమోహన్


సంతమాగులూరులో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్

కారంచేడు: వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఏ ఉమామహేశ్వరరావు మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కృషి, పట్టుదలతో ఎంతటి విజయాన్ని అయినా సొంతం చేసుకోవచ్చనడంలో వాల్మీకి మహర్షి చక్కటి ఉదాహరణ అని పేర్కొన్నారు. సంస్కృత భాషకు ఆద్యుడు కూడా మన వాల్మీకి అన్నారు. మండల కేంద్రమైన కారంచేడు చెరువు కట్ట మీద ఉన్న వాల్మీకి మహర్షి దేవాలయంలో ఆయన విగ్రహానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలతో వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన వితరణ చేశారు.

సంతమాగులూరు (అద్దంకి): మండల కేంద్రం సంతమాగులూరు శాఖా గ్రంథాలయంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని లైబ్రేరియన్ భాస్కరరెడ్డి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఆదర్శ పురుషుడు రాముని చరిత్ర మానవాళికి ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ భారతీయ ఇతిహాస సాహిత్యంలో అత్యంత ప్రముఖులైన, ప్రాచీన కవి వాల్మీకి అని అన్నారు. ఆయనను ఆదికవి అని పిలుస్తారన్నారు. వాల్మీకి సంస్కృతంలో రాసిన రామాయణం ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధమైన కావ్యాల్లో ఒకటి అని చెప్పారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డీ.ధనమ్మ, పి.హరిప్రసాద్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి


కొణికిలో సీసీ రోడ్డు నిర్మాణానికి పూజ చేస్తున్న అధికారులు

పర్చూరు (చినగంజాం)/ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో గురువారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. నూతలపాడు, నాగులపాలెం, రమణాయపాలెం, చింతగుంటపాలెం నందు కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతలపాడు పంచాయతీలో గ్రామ సభ నిర్వహించి రూ.45 లక్షలు అంచనా విలువతో సీసీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్, ఈఓపీఆర్డీ కే సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రామ సర్పంచ్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నాగులపాలెంలో సర్పంచ్, ఉప సర్పంచ్, బీజేపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ కొల్లా సుభాష్, గ్రామ నాయకులు, కార్యదర్శి ఉపాధి హామీ సిబ్బంది, ఎంపీడీఓ ఈఓపీఆర్డీ పాల్గొన్నారు. రూ.16 లక్షలతో 2 సీసీ రోడ్లను నిర్వహించేందుకు భూమి పూజ నిర్వహించారు.

- రమణాయపాలెం నందు రూ 2 లక్షలతో గ్రావెల్ రోడ్డు, చింతగుంటపాలెంలో రూ 3.52 లక్షలతో గ్రావెల్ రోడ్డు, ఓవర్ హెడ్ స్టోరేజీ ట్యాంక్ పనులకు భూమి పూజ నిర్వహించారు.
- ఇంకొల్లు మండలంలోని కొణికి, దుద్దుకూరు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ జీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


గోపాలపురంలో భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో

పల్లెపండుగతో సమస్యల గుర్తింపు..

అద్దంకి రూరల్/బల్లికురవ: పల్లెపండుగ కార్యక్రమం గ్రామాలకు దోహదపడుతుందని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. గురువారం కొమ్మినేనివారిపాలెం, వైదన, ముక్తేశ్వరం గ్రామాల్లో పలు అభివృద్ధిపనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

- అద్దంకి మండలంలోని గోపాలపురం, తిమ్మాయపాలెం గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా సైడు కాల్వలు, రోడ్లకు ఎంపీడీవో సింగయ్య భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కె. గాయత్రి లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.


చింతగుంటపాలెంలో భూమి పూజ చేస్తున్న సర్పంచ్

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం ఆశ్వీయుజ మాసం, అశ్వని నక్షత్రం, పాఢ్యమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకి సేవ నిర్వహిస్తారు. రాత్రి 7.45 గంటల అనంతరం ఆలయం మూసివేస్తారు.


పేరాల హైస్కూలు ఎదురు గోడ పక్కన పేరుకుపోయిన చెత్తకుప్ప

ఎటుచూసినా చెత్తకుప్పలే!

చీరాల రూరల్: మున్సిపల్ కార్మికుల నిర్లక్ష్యం కారణంగా చీరాల పట్టణంలో ఎటుచూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ కార్మికులు చెత్తకుప్పలు తొలగించకపోవడంతో కుప్పకుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీనికి తోడు ప్రతిరోజు విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. పేరుకుపోయిన చెత్తకుప్పలలో వర్షపు నీరు చేరడంతో పరిసరాలన్నీ దుర్గంధంతో నిండిపోతున్నాయి. చెత్తకుప్పలపై దోమలుచేరి జ్వరాలు, డెంగ్యూ వంటి వాటి బారిన పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పేరాల హైస్కూలు ఎదురుగా రెండు రోజులుగా ఉన్న చెత్తకుప్పలు తొలగించకపోవడంతో వాటిపై కుక్కలు, ఆవులు చేరి పెళ్లగిస్తున్నాయి. దీంతో పరిసరాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. సమీప నివాసులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలానే జక్కావారి వీధిలో, వెంగళరావునగర్ వద్ద కూడా చెత్త కుప్పలు తొలగించలేదు. మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలా పట్టణంలో అనేక ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తకుప్పలను మున్సిపల్ కార్మికులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



జక్కావారివీధిలో తొలగించని చెత్తకుప్పలు

రోడ్డు వేశారు.. కాలువలు మరిచారు

జే.పంగులూరు: మండలంలోని అలవలపాడు గ్రామంలో గల ఇంకొల్లు–అద్దంకి ప్రధాన సైడు కాలవల్లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఆ చివరి నుంచి ఈ చివరి వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున ఉన్న రోడ్డుకు సైడు కాలవలు నిర్మించలేదు. గతంలో మెటల్ రోడ్డుగా ఉండటంతో సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు విశాలంగా ఉన్నపటికి సైడు కాలువలు నిర్మించలేదు. సైడు కాలువ లేకపోవడం వలన కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డంతా నీటితో నిండిపోతుంది. చెత్తాచెదారం మొత్తం రోడ్డుపైనే ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోంది. గ్రామ పంచాయతీ ఇది మా పరిధి కాదని ఆర్ అండ్ బీ పరిధి అని సైడు కాలవలు నిర్మించేందుకు ముందుకు రావడంలేదు. అటు వాళ్లు పట్టించుకోక, ఇటు పంచాయితీ వారు పట్టించుకోకపోవడంతో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోని సైడు కాలవలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అలవలపాడు గ్రామంలోని ప్రధాన రోడ్డు